కుఱ్ఱాడు బస్తా కింద దింపి "ఎక్కడ వుంచమన్నారు బాబూ? అన్నాడు.

"అక్కడే వుంచు...అది సరే..." అని కొంచెం విచారంతో భార్యకేసి తిరిగి "నీ దగ్గర ఒక్క పది నయా పైసలు గానీ వుందా" అన్నాడు. ఆమె చేతినుంచి డబ్బు రాలేదు. పెదవులనుంచి చిరునవ్వు ఆ గదంతా ప్రసరించింది. ఆమె అన్నిటికి చిరునవ్వు నవ్వుతుంది. ఆమె అలా నవ్వి నప్పుడల్లా 'కష్టాల్ని ఇలా చిరునవ్వుతో ఎదుర్కోవాలి' అని మాధవరావు అనుకోవడం మామూలు. ఇప్పటి ఆ చిరు నవ్వుకు తెలుగు తర్జుమా. "మన దగ్గర ఆ డబ్బు అనే పదార్థం ఎలా వుంటుంది...లేదు" అని అతను సులభంగా తర్జుమా చేసుకొన్నాడు. మంచి అనుభవమున్న దేశభాషా దినపత్రిక సహాయసంపాదకుడు ఆంగ్ల భాషలోని వార్తలను తెలుగులోకి తర్జుమా చేసినంత త్వరితంగా ఆమె నవ్వును అర్థం చేసుకోగలడు. ఇతర్లకు ఆమె నవ్వు అపరిచితమైన పక్షుల 'కికకిచ, కూకూ' భాషవంటిది. చూసి ఆనందించ గలరు కానీ అర్థం చేసుకోలేరు.

"అతనికి బేడ యివ్వాలి. నా దగ్గర రెండు నయా పైసలే మిగిలి ఉన్నాయి. మిగతా నువ్వు సర్దాల్సిందే ఇప్పుడు. పెట్టె బేడా అలమరా గిలమరా అన్నీ వెతికి చూడు. ఆమాత్రం వుండకపోదు" అన్నాడు. అని ద్వారం అవతల నిల్చున్న కుఱ్ఱవాడికేసి 'ఇదంతా వీడు వింటూ ఉన్నాడు. ఇదేం బాగాలేదు" అన్నట్లు చూసి మళ్ళీ భార్య కేసి చూశాడు. ఆమె మళ్ళీ చిరునవ్వు నవ్వింది. తెలుగులో

